ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.14.02.2026 సమయం.18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలోని 7 నగరపాలక సంస్థల మేయర్లు, ఉపమేయర్లు, 116 పురసంఘాల ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లకు ఎల్లుండి ఎన్నిక జరుగుతుంది.
2. దేశంలో సాంకేతిక, గణిత విద్యలో బాలికల భాగస్వామ్యం 43 శాతానికి పెరిగిందని, ఇది ప్రపంచ సగటు కంటే ఎక్కువ అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు.
3. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు.
4. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రేపటి శివరాత్రి వేడుకలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి.

**మున్సిపల్ ఛైర్మన్లు**

రాష్ట్రంలోని 7 నగరపాలక సంస్థల మేయర్ల , డిప్యూటీ మేయర్లు ; 116 పురపాలక సంఘాల ఛైర్మన్లు ,వైస్ ఛైర్మన్లను ఎల్లుండి ఎన్నుకుంటారు. ఆయా జిల్లాల కలెక్టర్ల పర్యవేక్షణలో ఈ ఎన్నిక ఉంటుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. కాగా , మున్సిపల్ ఛైర్మన్ , మేయర్ ఎన్నికల్లో ఎంపీలు , ఎమ్మెల్సీలు ఓటు వేయాలంటే వారు స్థానికంగా తప్పనిసరిగా ఓటు హక్కు కలిగి ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఆయా పురపాలక సంఘాల పరిధిలో ఓటరుగా నమోదు కాకపోతే ఎక్స్ అఫీషియో సభ్యులుగా అనర్హులవుతారని పేర్కొంది. ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది.

**డెస్క్**

**కిషన్ రెడ్డి**

దేశంలో సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణిత విద్యలో బాలికల భాగస్వామ్యం 43 శాతానికి చేరిందని, ఇది ప్రపంచ సగటు కంటే ఎక్కువ అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. 2047 నాటికి దేశం వికసిత భారత్ గా రూపొందడంలో ఇలాంటి ప్రతిభావంతులైన విద్యార్థులే కీలక పాత్ర పోషిస్తారని ఆయన అన్నారు.

హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి లో ఈరోజు స్మార్ట్ జీనియస్ గ్లోబల్ లెవల్ అబాకస్, వేద గణితం, హ్యాండ్ రైటింగ్ పోటీల విజేతలకు ఆయన పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా 10 వేల మందికి పైగా విద్యార్థులు ఈ వేదికపై తమ ప్రతిభను ప్రదర్శించడం విశేషమన్నారు. కేవలం ఐదు నిమిషాల వ్యవధిలోనే 70 వరకు కఠినమైన గణిత సమస్యలను పరిష్కరించడం చిన్నారుల ఏకాగ్రతకు , క్రమశిక్షణకు నిదర్శనమని ఆయన అభినందించారు.

**బైట్: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**పీటీసీ,HYD**

**బండి సంజయ్**

కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికల్లో బీజేపీకి స్పష్టమైన మెజారిటీ వచ్చినా తమ పార్టీ అభ్యర్థిని మేయర్ కాకుండా మూడు పార్టీలు అడ్డుకుంటున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ , బిఆర్ఎస్ కు ఎంఐఎం అనుబంధ పార్టీగా మారిందని , ఆ మూడు పార్టీలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని విమర్శించారు.అయితే స్వతంత్ర అభ్యర్థులు బీజేపీలో చేరడంతో తమకు అవసరమైన మెజార్టీ సమకూరిందని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ , కాళేశ్వరం, మాదకద్రవ్యాలు వంటి కీలక కేసుల్లో అరెస్టులు జరగకపోవడమే వాటి మధ్య ఈ లోపాయికారీ ఒప్పందానికి

నిదర్శనమని వ్యాఖ్యనించారు. రాష్ట్ర ప్రభత్వం రైతులకు ఎరవులు , విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా మొండిచేయి చూపిస్తోందని విమర్శించారు.

**పీటీసీ, హైదరాబాద్**

**ఉత్తమ్ కుమార్**

పురపాలక సంఘాల ఎన్నికల ఫలితాలు ఉమ్మడి నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని మరోసారి నిరూపించాయని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, తమ పార్టీ విజయానికి ఉపకరించాయని నల్గొండ జిల్లాలో నగర పాలక సంస్థతో పాటు 16 పురపాలక సంఘాలను కాంగ్రెస్ కైవసం చేసుకుందని ఆయన అన్నారు.

**PTC, NALGONDA**

**వెంకట్ రెడ్డి**

నల్లగొండలో దాదాపు 2వేల కోట్ల రూపాయల విలువ గల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు పూర్తయిన తర్వాత మరిన్ని అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని ఆయన ఈరోజు నల్గొండలో చెప్పారు.

పురపాలక సంఘాల ఎన్నికల్లో విజయం సాధించిన కార్పొరేటర్లను ఆయన అభినందించారు. ఇకపై వారానికి రెండు రోజులు నల్గొండలో ఉంటూ ప్రతి డివిజన్ లో ప్రజా ధర్బార్ నిర్వహిస్తామని మంత్రి చెప్పారు.

**పీటీసీ నల్లగొండ**

**రహదారులు విస్తరణ**

హైదరాబాద్-పనాజీ ఆర్థిక కారిడార్ లోని   గూడెబెల్లూర్-మహబూబ్‌నగర్ మధ్య గల నంబర్ 167    జాతీయ రహదారిని  నాలుగు వరుసలుగా విస్తరించేందుకు కేంద్ర మంత్రివర్గం    ఆమోదం తెలిపింది.    80.01 కిలోమీటర్ల నిడివి గల ఈ రహదారి విస్తరణ పనులకు   3175.08 కోట్ల రూపాయల వ్యయమవుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిపన  సమావేశం అంచనా వేసింది. రాష్ట్రంలోని  మాగ్నూర్, మక్తల్, మరికల్, దేవరకదట్ర  జక్లైర్, యెలిగండ్ల, బండార్ పల్లి మీదుగా వెళుతున్న ఈ రహదారిపై ప్రస్తుతం రద్దీ  , ఇతరత్రా కారణాల వల్ల గమ్యం చేరేందుకు తీవ్ర జాప్యమవుతున్నందున      దీని విస్తరణకు ప్రభత్వం నిర్ణయించింది. ఇది పూర్తయితే ప్రయాణ సమయంలో  తగ్గడంతో పాటు సరకుల రవాణా ఖర్చులు తగ్గి ఈ ప్రాంత సామాజిక , ఆర్థికవృద్ధి మెరుగు పడుతుందని , నారాయణపేట, మహబూబ్ నగర్ జిల్లాలకు లబ్ధి చేకూరుతుందని     ప్రభుత్వం తెలిపింది. ఈ కారిడార్      విస్తరణ ప్రక్రియ వల్ల ప్రత్యక్షంగా        14.4 లక్షల పనిదినాలు,  పరోక్షంగా  19.9 లక్షల పనిదినాలు    కలుగుతాయి.  ఈ పథకం

150, 167 నంబర్ల జాతీయ రహదారులను అనుసంధానించి రాష్ట్ర వ్యాప్తంగా ఆర్థిక సామాజిక రంగాలకు సంబంధించి ఉపయోగపడుతుంది.

**పీఐబీ...ఎంఎస్ఎం**

**రైతు జాగృతి**

పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని స్వామినాథన్ చేసిన సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఫలితంగా ఆర్థికంగా నష్టపోయిన రైతులు పెద్ద సంఖ్యలో చనిపోయారని.. రైతు జాగృతి యాత్ర ఛైర్మన్ జగజిత్ సింగ్ డల్లేవాలా ఆందోళన వ్యక్తం చేశారు. పంటలకు మద్దతు ధర ప్రకటించాలని, చట్టబద్ధత కల్పించాలని కోరుతూ.. ఈ నెల 7వ తేదీన కన్యాకుమారిలో ప్రారంభించిన రైతు జాగృతి యాత్ర ఈరోజు హైదరాబాద్ చేరింది. ఈ సందర్భంగా జగజిత్ సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల నుంచి పంట కొనుగోలు చేయకుండా ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవడం శోచనీయమని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతు కమిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మీదుగా సాగుతున్న తమ యాత్ర ఢిల్లీతో ముగుస్తుందని అక్కడి రాంలీల మైదానంలో ఈ నెల 19వ తేదీన భారీ సభ నిర్వహిస్తామని ఆయన వివరించారు. రాష్ట్ర రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డితో ఆయన సమావేశం నిర్వహించారు.

డెస్క్

**శివరాత్రి**

ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని శైవక్షేత్రాలు రేపటి శివరాత్రి వేడుకలకు ముస్తాబు అయ్యాయి. వేములవాడ ,శ్రీశైలం, కోటప్పకొండ తదితర ఆలయాలను రంగురంగుల దీపాలతో అలంరించారు. శ్రీశైలంలో శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో నిన్నటి నుంచి అటవీ శాఖ టోల్ గేట్ల వద్ద రుసుంను మినహాయించారు. ఈ సదుపాయం ఎల్లుండి వరకు అమలులో ఉంటుందని నంద్యాల కలెక్టర్ రాజకుమారి తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సుమారు లక్షన్నర మంది భక్తులు విశ్రాంతి తీసుకునేలా చలువ పందిళ్లు వేయించినట్లు చెప్పారు.

డెస్క్

**శివరాత్రి- వేములవాడ**

వేములవాడలో 1200మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ మహేష్ బి. గీతే తెలిపారు. మహిళల రక్షణకోసం షీ టీం ఏర్పాటయ్యాయని చెప్పారు. విధుల్లో ఉన్న దేవస్థానం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని , ఏవైనా ఇబ్బందులు తలెత్తితే కమాండ్ కంట్రోల్ రూంకు తెలియజేయాలని ఉత్సవాలకు వచ్చే వాహనాలను క్రమపద్ధతిలో నిలిపేలా చూడాలని సూచించారు.

రాష్ట్రం నలుమూలల నుంచి ఈ ఉత్సవాలకు హాజరయ్యే భక్తుల కోసం 1.96 కోట్ల రూపాయలతో ఏర్పాట్లు చేశారు.దీనిపై ఆలయ కార్యనిర్వాహణాధికారి రమాదేవి ఆకాశవాణితో మాట్లాడుతూ...

**బైట్: ఈవో రమాదేవి**

**పీటీసీ, సిరిసిల్ల**

**ప్రజావాణి**

పురపాలక సంఘాల ఎన్నికల నియామావళి నేపథ్యంలో రద్దైన ప్రజావాణి కార్యక్రమం ఎల్లుండి సోమవారం నుండి పున:ప్రారంభం అవుతుందని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్ తెలిపారు. కాగా, యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎల్లుండి సోమవారం మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నికల ప్రక్రియ ఉన్నందున ఆ రోజు ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు.

**పీటీసీ నల్లగొండ, యాదాద్రి**

**శివరాత్రి-వేలాల**

శివరాత్రిని పురస్కరించుకొని మంచిర్యాల నుంచి కాళేశ్వరం, వేలాలకు ప్రత్యేక బస్సులు నడుతున్నట్లు మంచిర్యాల డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి

సర్వీసులో మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని, మహిళలు  తప్పనిసరిగా ఆధార్ కార్డును కలిగి ఉండాలని తెలిపారు.

**పీటీసీ, మంచిర్యాల**

ఆసిఫాబాద్ జిల్లాలోని ఈస్గాం ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో వేణుగోపాల్ గుప్తా తెలియజేశారు.  నిర్మల్ జిల్లా నుంచి వేములవాడ  , శ్రీశైలం వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు నిర్మల్ డిపో మేనేజర్ పండరి వెల్లడించారు.

**పీటీసీ, ఆసిఫాబాద్, నిర్మల్,**